స్వచ్ఛందంగా వివరాలు వెల్లడించాలి


సమగ్ర సర్వేలో పాల్గొన్న మేయర్ అమర్‌సింగ్


సర్వేలో పాల్గొన్న జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్ తదితరులు

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

మేడిపల్లి: పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కొనసాగుతుంది. పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్‌లో శనివారం మేయర్ అమర్‌సింగ్ పర్యటించి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వే వివరాలను సేకరించి పక్కాగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ వివరాలను వెల్లడించి అధికారులతో సహకరించాలని కోరారు.

రామంతాపూర్‌లో..

రామంతాపూర్: డివిజన్ పరిధిలో ఈనెల 6నుంచి నిర్వహించిన కుటుంబ సర్వేలో భాగంగా ప్రతి ఇంటింటికి స్టిక్కర్లు అతికించారు. శనివారం నుంచి ఎన్యూమరేటర్లు సమగ్ర సర్వేను ప్రారంభించారు. ఈ సర్వేలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం తమ ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించి వారు అడిగిన వివరాలు అందించాలని కోరారు. పనిపై బయటికి వెళ్తే ఆ ఇళ్లకు తిరిగి సర్వే నిర్వహించాలని ఆమె అధికారులను కోరారు.

తూతూ మంత్రంగా సర్వే !

• సర్వే సిబ్బంది తీరుపై ప్రజల ఆగ్రహం • ఇళ్లకు కనిపించని స్టిక్కర్లు • కాగితాలకే పరిమితమైన లెక్కలు


సర్వేలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, జెడ్సీ రవికిరణ్, డీసీరాజు

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సర్కిల్ పరిధిలో 1,60,036 ఇళ్లను సర్వేకోసం 1054 బ్లాక్‌లుగా విభజించారు. ఆరు డివిజన్లకు 59 సూపర్‌వైజర్లు, 1053 ఎన్యూమరేటర్లు సర్వేలో పాల్గొంటున్నారు. ఈనెల 6 నుంచి ఇంటింటికి తిరిగి సర్వే దరఖాస్తు ఫామ్ అందజేసి 90శాతం స్టిక్కర్లు వేశామని అధికారులు చెబుతున్నారు.

పత్తాలేని సిబ్బంది..

వాస్తవ పరిస్థితి గమనిస్తే సగం ఇళ్లకు కూడా స్టికర్లు లేకపోవడమే కాకుండా సిబ్బంది పత్తా లేకుండా పోయారనే ఆరోపణలున్నాయి. ఆర్కేనగర్‌లో ఒక వీధిలో అపార్ట్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న ఫ్లాట్‌కు స్టిక్కర్ వేసిన సిబ్బంది అదే ఏరియాలోని మరో వీధిలో ఏ ఇంటికీ స్టికర్ వేయలేదు. ఇలాంటి పరిస్థితి చాలా కాలనీల్లో ఉన్నాయని అక్కడి ప్రజలు చెబుతున్నారు. శనివారం నుంచి సర్వే కోసం వెళ్లిన సిబ్బంది


తాళం వేసిన ఇంటికి స్టిక్కర్ (వృత్తంలో)

కూడా పూర్తి స్థాయిలో వివరాలు సేకరించడం లేదు.

బీఆర్ఎస్ సర్వేలో అన్ని వివరాలు..

ఆనంద్‌బాగ్‌లో ఓ ఇంటి యజమాని పేరు రాసుకున్న ఎన్యూమరేటర్లు , అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న వారి పేరును కూడా యజమానిగా నమోదు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో అన్ని వివరాలు ఉన్నాయని, తిరిగి సర్వేలంటూ.. ప్రజలను మోసగించడమే తప్పా.. మరేమిలేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సర్వేకు సహకరించండి..

ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ నివాసంలో జెడ్సీ రవికిరణ్, డీసీ రాజు కుటుంబ వివరాలు సేకరించి సర్వేను ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన పాలన, సంక్షేమ పథకాలు అందించేందుకు ఉపయోగపడుతుంది.

– రవికిరణ్, జోనల్ కమిషనర్

బోగస్ సర్వే..



సర్వే పేరున సిబ్బంది, అధికారులు కాలయాపన చేస్తున్నారు. ప్రజా సమస్యలను పట్టించుకునే వాళ్లే లేకుండా పోయారు. బోగస్ సర్వేతో ప్రజల ఆస్తులకు లెక్కకడుతున్నారే తప్పా.. వారికి ఎలాంటి ప్రయోజనం లేదు. ప్రజాపాలన కాకుండా అధికారుల పాలన నడుస్తోంది.

– శ్రవణ్, మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్

ఇప్పటిదాకా ఎవ్వరూ రాలేదు



నర్సింహారెడ్డినగర్ అలంకృత అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్నాను. నా దగ్గరలోని అపార్ట్‌మెంట్‌కు సిబ్బంది వచ్చినా మా అపార్ట్‌మెంట్‌కు రాలేదు. సర్వేవల్ల ప్రజలకు మేలు జరుగుతుందని అనుకోవడం లేదు. సాంకేతిక పరిజ్ఞానంతో ఆధార్ నెంబర్ ద్వారా అన్ని వివరాలు తెలుసుకుంటున్న ఈ రోజుల్లో సర్వేలో వివరాలు తెలియజేయాలని అనడంలో అర్థంలేదు.

-కేవీఎస్. సుబ్బారావు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11కేవీ మల్లాపూర్ బెల్ సబ్‌స్టేషన్ స్టాండర్డ్ టైల్స్, జోఫ్లో ఫీడర్ల పరిధిలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు మల్లాపూర్ పారిశ్రామికవాడ ఏరియా రోడ్డు నెంబర్ 01 నుంచి 17,18,22లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు.

నాచారంలో...

33/11 కేవీ నాచారం సబ్‌స్టేషన్ పరిధిలో కేవీ స్టాలిన్ టైర్, భాగ్యనగర్, అవురా, దుర్గానగర్, చందమామా ఫీడర్ల పరిధిలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పారిశ్రామికవాడ, సింగచెరువు తండా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు.

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్ -2 పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బాలరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫేస్-1, 11 కేవీ ఫీడర్ పరిధిలోని ఆవిష్కార్, రాణి పాలిమర్స్, హీట్ రిడర్స్, నెస్ట్ కంపెనీ, కింగ్స్ మైనింగ్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్పొరేటర్ పర్యటన


కార్పొరేటర్ రాజ్యలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధి సాయినగర్‌లో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసుల ఫిర్యాదు మేరకు సంబంధిత అధికారులు విద్యుత్, వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణప్రసాద్‌తో కలిసి పర్యటించి కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా కొత్త పోల్స్, త్రీఫేస్, డ్రైనేజీ కనెక్షన్ ఇస్తామన్నారు. ప్రభుత్వ స్కూల్, అంగన్‌వాడీలను పరిశీలించారు. కాలనీ అధ్యక్షుడు ఉపేందర్, కార్యదర్శి రమేష్, జగదీష్‌చారి, చంద్రమౌళి, వెంకటేష్, రమాదేవి, సుజాత, పద్మ, సుమతి, సంగీత, సోమేష్, ధనరాజు, పండు, కృష్ణ, రాజేష్, ఓంప్రకాష్, సాయి, సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి

కాప్రా: ఉప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. శనివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఏఎస్‌రావునగర్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ భగాయత్‌లో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తే నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, ప్రభుత్వం ఉప్పల్‌కు డిగ్రీ కాలేజీ మంజూరు చేసిందని తెలిపారు. ఏబీవీపీ నేతలు బుర్ర అనిల్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నేతలు

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

కాప్రా: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి సూచించారు. శనివారం డివిజన్ పరిధిలోని సీఎస్‌నగర్, వినాయక్‌నగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందన్నారు. దీనిలో భాగంగానే కాప్రా డివిజన్‌కు స్పెషల్ ఫండ్ తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. స్థానిక కాలనీవాసులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

కరాటే పోటీల బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: సన్‌ఫైటర్స్ కుంగ్‌ఫూ ఇంటర్నేషనల్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో 11వ నేషనల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీల బ్రోచర్‌ను శనివారం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకోవాలని చెప్పారు. పురుషులతో పాటు మహిళలు ఆత్మ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు. టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ నంద ప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే ఆనందం

రామంతాపూర్: వెంకట్‌రెడ్డినగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీత్రిశక్తి నల్ల పోచమ్మ దేవాలయ విగ్రహ శిఖర కలశ ధ్వజ ప్రతిష్ఠాపన ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల ఆహ్వానపత్రికను తోగుట శ్రీ మదనానంద పీఠాధీశ్వరులు శ్రీ మాధవానంద సరస్వతి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనలు పెంపొందించుకుని దైనందిన జీవితంలో ప్రతిరోజు భగవంతుడిని ఆరాధిస్తే జీవితంలో ఆందోళనలు, అనారోగ్యాలు దరిచేరక మనశ్శాంతి, ఆరోగ్యం, ఆనందం సిద్ధిస్తుందన్నారు. మహాభాగ్యనగర బ్రహ్మణసేవా సమితి అధ్యక్షుడు మహదేవభట్ల లక్ష్మణ్‌ప్రసాద్‌శర్మ, ఆలయ చైర్మన్ గడ్డం సాయికిరణ్, అధ్యక్షులు ఆవుల సుధాకర్, సుదర్శన్‌రెడ్డి, అనిల్‌గౌడ్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఫౌండర్ మృతి


జవహర్ బాషా (ఫైల్)

మల్లాపూర్: తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఫౌండర్ సభ్యులు ఎస్. జవహర్‌బాషా (70) శనివారం కన్నుమూశారు. నాచారం డివిజన్ స్నేహపురికాలనీకి చెందిన జవహర్ బాషా అనారోగ్యంతో మృతిచెందారు. జవహర్ తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఫౌండర్ సభ్యుడు, ఆల్ ఇండియా మేనేజింగ్ కమిటీ సభ్యులు, ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ సభ్యులు, సౌత్ ఇండియా లారీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, తెలంగాణ లారీ అసోసియేషన్ అడ్వైజర్‌గా ఆయన పని చేశారు. లారీ అసోసియేషన్ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, సంతాపం ప్రకటించారు.

సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలి


ఆచార్య వందన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బోడుప్పల్: హిందూ సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్ రెడ్డి అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో హిందూ స్పిరిచ్‌వల్ సర్వీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ×ఆచార్య వందన్॑ కార్యక్రమంలో విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచి మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని వాటిని పాటించాలన్నారు. అవధాన సరస్వతి పీఠం ఫౌండర్ మాడుగుల నాగఫణిశర్మ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాష్టమి వేడుకలు



మౌలాలి : గోపాష్టమి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మౌలాలి డివిజన్‌లో సాయినాథపురంలో ఘనంగా గోపాష్టమి వేడుకలు నిర్వహించారు. గోవులకు వేదమంత్రాలతో పూజలు చేసి గోమాత ఆశీర్వాదం తీసుకున్నారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నేతలు, కార్యకర్తలతో పాటు స్థానికులు, మహిళలు, భారీగా పాల్గొన్నారు. గోమాతకు శాస్త్రోక్తంగా ఘనంగా పూజలు చేశారు. ప్రభుత్వం గోవును జాతీయ జంతువుగా ప్రకటించి కన్నతల్లి లాంటి గోమాతలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సదర్ వేడుకలు


సదర్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని సంతోషిమానగర్‌లో శనివారం నిర్వహించిన సదర్ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరయ్యారు. బర్ల నరేష్‌యాదవ్, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, వెంకటేష్‌యాదవ్, సతీష్‌కుమార్, ఎస్ఆర్. ప్రసాద్, సంతోష, రాందాస్, వినోద్‌యాదవ్, వెంకటేశ్వర్‌రావు, రఘుయాదవ్, సందీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల ఆదాయం కోసమే నిర్మాణాలు


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాప్రా గ్రామాభివృద్ధి సమిష్టి సంఘం ప్రతినిధులు

కాప్రా: కాప్రా ప్రభుత్వం స్కూల్ సమీపంలోని గ్రామకంఠం భూమిలో చేపట్టిన నిర్మాణాలు ఆలయాల అభివృద్ధి కోసమేనని కాప్రా గ్రామాభివృద్ధి సమిష్టి సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం, పోచమ్మ ఆలయాలకు ఎలాంటి ఆదాయ మార్గాలు లేకపోవడంతో గ్రామకంఠం స్థలంలో షెటర్లు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. వీటి ద్వారా వచ్చే అద్దెలతో ఈ ఆలయాల్లో దూపదీప నైవేద్య ఖర్చులు, అర్చకుల వేతనాలు కొంతమేరనైనా భర్తీ చేయవచ్చనే ఆలోచనతో గ్రామస్తులందరూ కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దాదాపు 60 గజాల ఈ స్థలం గ్రామం మధ్యలో ఉండటంతో కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అలా జరగకుండా గ్రామం కోసం ఉపయోగపడేలా ఆలయాలకు నిధులు సమకూర్చేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. నిర్మాణాలకు ఎలాంటి అడ్డంకులు రాకుండా చూడాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కోరామన్నారు. బీఆర్ఎస్ నేతలు బైరి నవీన్‌గౌడ్, సంఘం గౌరవ అధ్యక్షులు కొప్పుల కుమార్, ప్రతినిధులు అశోక్‌కుమార్, నవీన్‌కుమార్, శ్రీనివాస్, నరేందర్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం


కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న రవిగౌడ్

బోడుప్పల్: చెంగిచర్లలోని బీఎంఆర్ఎస్ గ్రామర్ స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్‌ను మాజీ ఉపసర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కొత్త రవిగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. విద్యార్థులను కేవలం చదువుకే పరిమితం చేయకుండా అన్ని రకాల క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే కంప్యూటర్‌లో శిక్షణ ఇవ్వాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్ అందజేత


యూనిఫామ్స్ అందిస్తున్న జాయ్ అలుక్కాస్ ఫౌండేషన్

కాప్రా: ఎల్లారెడ్డిగూడలోని అనురాగ్ స్కూల్ విద్యార్థులకు జాయ్ అలుక్కాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూనిఫామ్స్ అందించారు. స్కూల్‌లోని ప్రత్యేక అవసరాలు కలిగిన 99 మంది విద్యార్థుల యూనిఫామ్స్ వారివారి తల్లిదండ్రులకు అందజేశారు. విద్యార్థుల కోసం స్కూల్‌లో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలపై అనురాగ్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రామ్‌కు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. జాయ్ అలుక్కాస్ ఫౌండేషన్ ప్రతినిధులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి లీకేజీపై చర్యలు తీసుకోండి


అధికారులతో కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 25వ డివిజన్ సాయినగర్‌కాలనీలో తాగునీటి పైపులైన్ లీకేజీతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో శనివారం కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి వాటర్‌వర్క్స్ అధికారి మేనేజర్ తిరుపతిని కలిసి సాయినగర్ లీకేజీలపై వివరించారు. అనంతరం మేనేజర్ మాట్లాడుతూ.. కాలనీల్లోని పైపులైన్ లీకేజీలను పరిశీలించి పనులను త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయపాల్‌రెడ్డి, 25వ డివిజన్ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్‌చారి, మధుసూదన్, భాను, వాటర్‌లైన్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాల దరఖాస్తులకు ఆహ్వానం

రామంతాపూర్: సామాజికసేవ, రోటరీ లయన్స్ వాసవి ఇతర కులసంఘాలతో పాటు సాంస్కృతిక రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను ప్రోత్సహించేందుకు మహిళాస్ఫూర్తి అవార్డులను ఈనెల 19న బిర్లా ప్లానెటోరియంలో అవార్డులు అందజేస్తున్నట్లు శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కమల మనోహర్ శనివారం పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం కృషిచేస్తున్న మహిళలను గుర్తించి వారు చేస్తున్న కృషి సేవలను ప్రోత్సహించడానికేనని ఆమె స్పష్టం చేశారు. మహిళలు తాము సమాజానికి చేసిన సేవలు ఫోటోలతో పాటు ఇతర వివరాలకు వాట్సాప్ నెంబర్ 9392937486.

రైల్వే అధికారుల సందర్శన

మల్లాపూర్: మల్లాపూర్‌లో ఎంఎంటీఎస్ స్టాప్ కోసం రైల్వే అధికారులు పర్యటించి సందర్శించారు. రైల్వే డీఆర్ఎం ఉన్నతాధికారుల ఆదేశాలతో సికింద్రాబాద్ డివిజన్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ బీకే సిన్హా సందర్శించారు. మాజీ కౌన్సిలర్ కేశవరం ఆంజనేయులు, శేఖర్‌బాబు, కేశరం సాయికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

మల్లాపూర్: నాచారం అకడమిక్ హైట్స్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం బచ్‌పన్ ప్రీ స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సురన ఇండస్ట్రీస్ డైరెక్టర్ విజయసురన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నానమ్మ, తాతయ్యలపై ప్రేమ, ఆప్యాయతలు పెరిగి తమతో పాటే ఉండాలని భావన పిల్లల్లో పెరగుతుందన్నారు. గ్రాండ్ పేరెంట్స్ అంతా తమ మనువళ్లు, మనవరాళ్లతో కలిసి రాంప్‌వాక్ చేసి ఆనందాన్ని ప్రతి ఒక్కరితో పంచుకున్నారు. పాఠశాల డైరెక్టర్ చిలక శివకుమార్, కరస్పాండెంట్ కల్పన, ప్రధానోపాధ్యాయురాలు నిషాత్ అంజుమ్ తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

సమన్వయంతో పనిచేయండి



మల్కాజిగిరి: జీహెచ్ఎంసీ, విద్యుత్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు. టీజీఎస్‌పీసీ డీఎల్ విభాగం నిర్వహణలో భాగంగా చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారని, వ్యర్థాలను తొలగించడం లేదన్నారు. దీనివల్ల గ్రీన్‌వేస్ట్‌తో పాటు విద్యుత్ స్తంభాలు అక్కడే వదిలివేయడం వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. రెండు విభాగాల అధికారులు సమన్వయ లోపమే ఈ సమస్యకు కారణమని ఇకముందు ఇలా జరగకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ఏఈ విద్యాసాగర్, శ్రీనివాస్, శివానంద్, రాజు ఉన్నారు.

రూ.22 లక్షలతో అభివృద్ధి పనులు


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని రామాంజనేయనగర్‌లో రూ.22లక్షలతో ఆర్‌సీసీ పైపులైన్ పనులను శనివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ఎజెండాగా తీసుకుని అన్ని డివిజన్లకు ప్రాధాన్యతనిస్తూ.. అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామన్నారు. అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నశ్రీనివాస్, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు, డివిజన్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

షవర్మ కేంద్రం సీజ్

ఆందోళన చేపట్టిన వ్యాపారస్తులు


లోతుకుంట షవర్మ కేంద్రాన్ని మూసివేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

అల్వాల్: లోతుకుంటలోని షవర్మ కేంద్రాన్ని అల్వాల్ సర్కిల్ ఆహార భద్రతాధికారి లక్ష్మీకాంత్, శానిటరీ సూపర్‌వైజర్ ప్రభాకర్‌లు మూసివేశారు. వివరాల ప్రకారం.. లోతుకుంటలోని షవర్మ కేంద్రంలో తరచూ వినియోగదారులు అస్వస్థతకు గురవుతున్నారన్న వార్తలు వస్తుండటంతో శనివారం విక్రయకేంద్రాన్ని మూసివేయించారు. ఈ షవర్మ కేంద్రానికి ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ సైతం లేదని ఈ విషయంపై గతంలో కూడా పలుమార్లు హెచ్చరించినప్పటికీ మార్పు రాలేదన్నారు. ఇదిలా ఉండగా తమను అధికారులు ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తూ అల్వాల్ సర్కిల్ కార్యాలయం ఎదుట శనివారం వ్యాపారస్తులు ఆందోళన చేశారు. తాము అస్వస్థకు గురయ్యామని ఎవరు ఫిర్యాదు చేయలేదని, ఎలాంటి హానికర రసాయనాలు వాడుతున్నామని అధికారులు సైతం నిరూపించలేదన్నారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న షవర్మ కేంద్రం గత కొంతకాలం నుంచి వివాదాస్పదంగా మారడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


ఉప్పల్ మినీ శిల్పారామంలో..

కాప్రా: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జ్యోతిరెడ్డి శిష్యబృందం వినాయక కౌతం, రామరామరామ, తారంగం, గురుబ్రహ్మ, గురువిష్ణు, జనుతశబ్దం, రామాయణ శబ్దం, కృష్ణశబ్దం నృత్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. సహస్ర, గోపిక, శ్వేత, పార్వతి, మహాలక్ష్మి, హాన్విత, నక్షత్ర, వైష్ణవి, సిరి, హంసిని, కీర్తి తదితరులు పాల్గొన్నారు.